క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



కన్నాయిగూడెం: మండలంలోని చింతగూడెం గ్రామ పంచాయతీలలోని గొత్తికోయగూడెంలో మడకం జ్యోతి అంబులెన్స్‌లో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాలలోకి వెళితే.. జ్యోతికి పురిటినొప్పులు రావడంతో స్థానిక ఆశ కార్యకర్త లక్ష్మి 108 కు సమాచారం ఇచ్చింది. అందులో వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో జ్యోతి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ ఈఎంటీ కల్యాణ్ చాకచక్యంగా డిలివరీ చేయడంతో తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. వారిని ఏటూరు నాగారం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన జిల్లాకేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దేవగిరిపట్నం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కోర్టు వద్దకు వచ్చాడు. తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రహదారి డివైడర్ తొలగించిన వద్ద దాటే ప్రయత్నం చేస్తున్న క్రమంలో జంగాపల్లి నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తు ఢీకొట్టారు. సంఘటనలో ముగ్గరు వ్యక్తులకు గాయాలయ్యాయి. సుబ్బారెడ్డికి తలకు బలమైన గాయం అయింది. దీంతో ముగ్గురు వ్యక్తులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని ఒకరికి..



ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్యుడు

ములుగు రూరల్: లారీ ఢీ కొని ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని జాకారం వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బాపూర్ గ్రామానికి పశువుల కాపరి చెందిన రాజయ్య జాకారం వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ ఢీ కొట్టింది. దీంతో రాజయ్య కాలుకు తీవ్ర గాయం కావడంతో వైద్యుడు ప్రవీణ్ ప్రథమ చికిత్స అందించి 108కు సమాచారం అందించి ములుగు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

గుడుంబా పట్టివేత..



అరెస్టు చూపిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

ఏటూరునాగారం: మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ముగ్గురు వ్యక్తుల వద్ద 55 లీటర్ల గుడుంబాను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వివరాలు వెల్లడించారు. బస్టాండ్ వద్ద సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానితులుగా కనిపించారన్నారు. వారి వద్ద తనిఖీ చేసి వివరాలు సేకరించగా గోవిందరావుపేట మండలం రాంనగర్ గ్రామానికి చెందిన జరుపుల శ్రీకాంత్, బానోతు చందు, గుగులోతు మమతలు బ్యాగుల్లో గుడుంబాను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసి ఏటూరు నాగారంలో విక్రయించేందుకు వచ్చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ట్రైనీ ఎస్సైలు రచిత్ర, నరేష ఏఎస్సై సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ బాలాజీ, కానిస్టేబుల్స్ ధ్రువ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

తాడు జారితే అంతే..



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో దేవాదాయశాఖ అధినంలోని కాటేజీ భవనం గోడ మధ్యలో పైపులైన్ వద్ద పచ్చిమొక్కలు పెరిగాయి. వాటిని తొలగించేందుకు ఎత్తు ఉన్న నిచ్చెన లేకపోవడంతో గురువారం సిబ్బంది భవనంపై నుంచి తాడుకు కర్ర కట్టి దానిపై సిబ్బంది కూర్చొని మరో ఇద్దరు కిందకు వదిలి చెట్టును తొలగించారు. తాడుతో చెట్టును తొలగించేందుకు సిబ్బంది సాహసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాడు జారితే పరిస్థితి ఏమిటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయశాఖ అధికారులు పనులకు సంబంధించిన పరికరాలను సమాకుర్చాలని తెలుపుతున్నారు.

అంబులెన్స్ లేక అవస్థలు

- రోగులకు తప్పని తిప్పలు
- అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలే దిక్కు



గోవిందరావుపేట: మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా 30 వేలకు పైగా జనాభా ఉన్నారు. బాధితులకు మండల కేంద్రంలో ఉండే వాహనం అందుబాటులో లేకపోవడంతో 108 అంబులెన్స్ రావాల్సి వస్తుంది. దీంతో మండల ప్రజలకు అత్యవస సమయంలో ఆస్పత్రికి వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. మండలంలో నాలుగు గ్రామ పంచాయతీలు జాతీయ రహదారిపై ఉండగా ఏదో ప్రైవేట్ వాహనం దొరుకుతుంది. కాని మిగిత గ్రామాల్లో ప్రైవేట్ వాహనాలు కూడా దొరకని పరిస్థితి. మండలానికి సంబంధించిన 108 అంబులెన్స్ వాహనం 15 రోజుల నుంచి అందుబాటులో లేకపోవడంతో పక్క మండలం అంబులెన్స్ రావడానికి సమయం పడుతుండడంతో ప్రమాద బాధితులు, రోగులు ఆస్పత్రికి సరైన సమయానికి వెళ్లలేకపోతున్నారు. ఇటీవల తరుచు రోడ్డు ప్రమాదాలు జరగడం, సీజనల్ వ్యాధుల కాలం కావున రోగుల సంఖ్య పెరుగుతుండడంతో స్థానికంగా అంబులెన్స్ సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాల ద్వారా దవాఖానకు వెళ్తున్నారు. 108కి ఫోన్ చేస్తే మేడారం నుంచి లేదా ఏటూరునాగారం నుంచి లేదా ములుగు నుంచి రావాలని అంటూ సమాధానం చేపుతున్నారని బాధితులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే మండలానికి 108 అంబులెన్స్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వాహనం రిపేరులో ఉంది

మండలానికి సంబంధించిన 108 వాహనం రిపేరులో ఉంది. మరో మూడు లేదా నాలుగు రోజుల్లో మరమ్మతు పూర్తమవుతుంది. అందుకే మేడారం, తాడ్వాయి వాహనం బాధితులు అందుబాటులోకి తెస్తున్నాం.

– రాజ్‌కుమార్, ఏరియా మేనేజర్, ములుగు జిల్లా

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కల్లుగీత కార్మికులు

- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవిగౌడ్

మంగపేట: ఏజెన్సీలో నివసిస్తున్న గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కమలాపురం అంబేడ్కర్ సెంటర్ నుంచి మండల కేంద్రం వరకు కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కల్లు గీత కార్మిక సమస్యలపై గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి రవిగౌడ్ హాజరై మాట్లాడారు. ఏజెన్సీలో నివసిస్తున్న గీత కార్మికులు అనేక రకాల సమస్యలతో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఏజెన్సీలో రద్దు చేసిన కల్లుగీత సొసైటీలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సభ్యత్వాలను నమోదు చేసి గీతా కార్మికులకు సేఫ్టీ మోకులు ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. కల్లు గీత సంఘం కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్, కమిటీ సభ్యులు సత్యంగౌడ్, గీతకార్మికులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి

- విద్యుత్ ఏఈ స్వామి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కన్నాయిగూడెం: వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ ఏఈ స్వామి అన్నారు. మండలంలోని గుర్రేవులలో రైతులతో కలిసి రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటార్లకు ఆటోమెటిక్ స్టాటర్లు ఏర్పాటు చేసుకొవద్దన్నారు. విద్యుత్ సమస్యలు వస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ దేవేందర్, అసిస్టెంట్ లైన్‌మెన్లు నర్సింహారావు, నవీన్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఎస్ఎస్ తాడ్వాయి: పరామర్శిస్తున్న రేగ కల్యాణి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన పెనక సమ్మయ్య ఇటీవలన అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పేద మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి గురువారం పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ ఊకే పోతరాజు, మాజీ సర్పంచ్ మౌనిక, గోవిందరావుపేట మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు చింత క్రాంతి, నాయకులు గొంది కిరణ్, శ్రావణ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



ములుగు రూరల్: పరామర్శిస్తున్న సతీశ్‌రెడ్డి

ములుగు రూరల్: మండలంలోని పొట్లాపూర్ మాజీ సర్పంచ్ ఏలూరి సూరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ రెడ్‌కో చైర్మన్ యారువ సతీశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, వేములపల్లి భిక్షపతి, కుమిత అంకిరెడ్డి, చంద్రమౌళి, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, మురళి, రాందాస్, మహేందర్, రఘు, శ్రీనివాస్, బాలునాయక్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



రేగొండ: డిక్షనరీలు అందజేస్తున్న కృష్ణకుమారి

రేగొండ: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని గంగిశెట్టి ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ మెమోరియల్ నిర్వహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ డిక్షనరీలు, షీల్డ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆకాంక్షకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని అన్నారు. ఎంఐఎస్ తౌటి నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ

కాటారం: ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన రూ.4,09,61,996 వ్యయం పనులపై గత పది రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేపట్టి నివేదికలు తయారు చేశారు. 24 గ్రామపంచాయితీలకు సంబంధించిన పనుల వివరాలు, అవకతవకలను తనిఖీ బృందాల డీఆర్పీలు సమావేశంలో వెల్లడించారు. రూ.80814 అవకతవకలు జరిగినట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు బాధ్యులైన ఉపాధిహామీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు జరిమానా విధించారు. అనంతరం నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య, ఉపాధిహామీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ దండ్రు రమేశ్‌ను అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి రూబినాబేగం, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోలర్ ధరమ్‌సింగ్, ఎంపీడీఓ బాబు, ఎస్ఆర్‌పి కవిత, ఏపీఓ వెంకన్న, డీఆర్‌పీలు, టీఏలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం..



మాట్లాడుతున్న శ్రీకాంత్ నాయుడు

వాజేడు: నులిపురుగుల నివారణ దినోత్సవం రోజు సమన్వయంతో పని చేద్దామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యశాఖ, గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యాశాఖ, ఐసీడీఎస్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 11న నులిపురుగుల నివారణ దినోత్సవం రోజు అన్ని పాఠశాలలు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న ప్రతీ ఒక్కరికి వీటిని అందించాలని తెలిపారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘు మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీలంతా ఏకం కావాలన్నారు. బీజేపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పి 42 శాతం రిజర్వేషన్ దక్కించుకోవాలన్నారు. నాయకులు శ్రీనివాస్, సులేమాన్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వాజేడు: ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా ఈ నెల 11న వాజేడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్స్‌పాల్ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10.00 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలను కళాశాలలో హాజరుకావాలన్నారు. ముందుగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అదుపు తప్పి బ్రిడ్జి కింద పడిన కారు



కిందికి దూసుకెళ్లిన కారు

గణపురం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గణపురం–ధర్మరావుపేట గ్రామాల మధ్య ఉన్న మోరంచ వాగు వద్ద ఘటన బుధవారం రాత్రి ఓ కారు అదుపు తప్పి బ్రిడ్జి కింద పడింది. భూపాలపల్లి కారల్ మార్క్స్ కాలనీకి చెందిన నరేందర్ గణపురం నుంచి భూపాలపల్లి వైపునకు వెళ్తుండగా రోడ్డుపైన ఉన్న గుంతను గమనించక అదుపు తప్పి బ్రిడ్జి కిందకు దూసుకెళ్లింది. ఈ సమయంలో నరేందర్ కారు నడుపుతున్నాడని, ఆయనకు ఎలాంటి ప్రమాదం జరగ లేదని పోలీసులు తెలిపారు.

ఆస్పత్రిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం



ములుగు రూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని మహిళ మృదేహం ఉందని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మహిళ ఈ నెల 05న జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వచ్చి అడ్మిట్ అయింది. కికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందిందని, మృతురాలు నీలిరంగు జాకెట్, గోదుమ కలర్ దుప్పటి కప్పుకొని ఉంది. చెవులకు బంగారు రంగు కమ్మలు , చేతులకు ఆకుపచ్చ గాజులు ఉన్నాయి. ఆస్పత్రి రికార్డులో బట్టు రాములమ్మ, భర్త మల్లయ్య, గ్రామం కొత్తపల్లిగోరిగా నమోదు చేసుకుంది. కాగా ఆ వివరాలతో తనకు సంబంధించిన వారు లభ్యం కాలేదని ఎస్సై తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 87126 70082, 87126 70081కు సమాచారం అందించాలని తెలిపారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

- పస్రా ఎస్సై అచ్చ కమలాకర్



తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల వ్యాప్తంగా ప్రధాన కూడలిలో, షాపులల్లో, రహదారిపై వాహనాల్లో నార్కోటిక్ స్నైపర్ డాగ్‌తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలుపాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కావొద్దని డీసీపీఓ, ఎల్‌సీపీఓ సంజీవ, బాలసదనం కౌన్సిలర్ రాణి, ఉమెన్‌హెచ్‌ఓటీ జెండర్ స్పెషలిస్ట్ స్రవంతి అన్నారు. గురువారం మినీగురుకులం, ఎస్‌టీబీహెచ్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థినులకు బాల్యంపై భరోసా సదస్సును నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న సమస్యలకు ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. అలాగే బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు.

ఇసుక లారీలతో రోడ్డు ధ్వంసం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మంగపేట: మండలంలోని మల్లూరులోని మామిడిగూడెం నుంచి పంట పొలాలకు వెళ్లే ఒర్రె వరకు రోడ్డుపై ఇసుక లారీలు రాకపోకలు కొనసాగిస్తుండటంతో రోడ్డు ధ్వంసమైందని రైతులు తహసీల్దార్ రవీందర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇసుక క్వారీ నుంచి ఇసుకను తరలించేందుకు ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేసుకోవాల్సిన నిర్వాహకులు పంట పొలాలకు వేళ్లే రోడ్డుపై వెళ్లడంతో రోడ్డు ధ్వంసమైందన్నారు. నిత్యం లారీలను రోడ్డుపై నిలిపి ఉంచుతుండటంతో వ్యవసాయ పనులకోసం టాక్టర్లు, ఎడ్ల బండ్లు వెళ్లే వీలులేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వెంటనే పంట పొలాలకు వెళ్లే పంచాయతీరాజ్ శాఖకు చెందిన రోడ్డుపై ఇసుక లారీల రాకపోకలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అక్కయ్య చౌదరి, కొనకంచి వినోద్, యర్రంగారి శ్రీనివాస్, గరికపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: మల్లంపల్లి మండలంలోని మద్దునూరు తండాలో తాగు నీటి సమస్యను పరిష్కష్కారించాలని కోరుతూ గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ.. మద్దునూగు గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గతంలో అనేకసార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైన గ్రామంలో తాగు నీరు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జన్ను దేవేందర్, గుగులోతు రమేష్ తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



వెంకటాపురం(ఎం): తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సిబ్బంది

వెంకటాపురం(ఎం): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ములుగు ప్రాజెక్ట్ సీడీపీఓ శిరీష అన్నారు. ములుగు పరిధిలోని వెంకటాపూర్, అందుగులమణి, నర్సింగాపూర్ సెంటర్‌లలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ శిరీష హాజరై మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతీ నెల బరువు పర్యవేక్షించుకోవాలని తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ, స్కూల్ హెచ్‌ఎం సర్వర్, డాక్టర్ నవీన్, ఏఎన్ఎం వరలక్ష్మీ, శోభారాణి, రాజ్యలక్ష్మీ, కవిత, అంగన్వాడీ టీచర్స్ సరోజన, సవిత, మంజుల, రజిత, భవాని, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె): పాత్రాపురంలో..

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ మాట్లాడుతూ.. తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

తపాలా జీవిత బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న హనుమంతు

చిట్యాల: మండలంలోని అందుకుతండా గ్రామానికి చెందిన అజ్మీరా రమేశ్ ఇటీవల మృతి చెందాడు. దీంతో మృతుడికి తపాలా పోస్టఫీస్ ద్వారా రూ.2,09600 జీవిత బీమా చెక్కు మంజూరైంది. దీంతో రమేశ్ కుటుంబ సభ్యులకు చెక్కును గురువారం హనుమకొండ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ హనుమంతు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత బీమా కలిగి ఉండడం వలన కలిగే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. 18 సంవత్సరాలు కలిగిన ప్రతి ఒక్కరూ జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.